ఆశల సౌధం.. అసౌకర్యాల భారం!

పేదలు ఆత్మగౌరవంతో బతకాలనే నినాదంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా డబుల్ బెడ్‌రూం ఇళ్లను రూపకల్పన చేసింది. నిలువ నీడ లేక గుడిసెల్లో నివసించే వారిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించింది. డబుల్ బెడ్‌రూం లభించిందన్న సంతోషం ఒకవైపు... అంతేస్థాయిలో నిర్వహణ భారంగా మారడంతో దిక్కుతోచని స్థితిలో నివాసితులు అవస్థలు పడుతున్నారు.


ఎరుకల నాంచారమ్మ బస్తీలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయాలు

- 'డబుల్' ఇళ్ల నివాసితులపై చిన్నచూపు!
- భరించలేనంతగా మెయింటెనెన్స్ వ్యయం
- చెత్త సేకరణలోనూ సర్వత్రా నిర్లక్ష్యం
- అసాంఘిక కార్యకలాపాలకు నిలయం
- సమస్యల ఊబిలో ఎరుకల నాంచారమ్మ బస్తీ ఇళ్ల సముదాయాలు

మన్సూరాబాద్: నాగోలు డివిజన్ ఎరుకల నాంచారమ్మ బస్తీలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయాలు సమస్యల నిలయాలుగా మారుతున్నాయి. నామమాత్రపు వసతులు.. భరించలేని విధంగా ఉన్న నిర్వహణ వ్యయం పేదలపాలిట శాపంగా మారుతున్నాయి.

- ఖాళీగా ఉన్న నివాసాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారుతున్నాయి. తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి అసాంఘిక కార్యకలపాలు జోరుగా కొనసాగిస్తున్నారు.
- సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామంటూ ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదు.
- ప్రభుత్వం ఉచితంగా ఇచ్చిందని డబుల్ నివాసితులపై ప్రజాప్రతినిధులు, అధికారులు చిన్న చూపు చూస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.
- రెక్కాడితే కానీ డొక్కాడని పేదలు నివసించే డబుల్‌బెడ్‌రూం సముదాయాల నిర్వహణ నివాసితులకు భారంగా మారింది.
- ప్రతి నెల సంపాదించిన దానిలో నిర్వహణకు చాలా చెల్లించాల్సి వస్తుండటంతో జీవనం ఇబ్బందిగా మారుతోంది.
- డబుల్ సముదాయాల మెయింటెనెన్స్ కోసం సుముదాయాల్లో కేటాయించిన దుకాణాల ఆదాయం అంతంతమాత్రంగా ఉండటంతో ఎక్కువ భారం నివాసితులపై పడుతోంది.
- డబుల్ బెడ్‌రూం సముదాయాల్లో జీహెచ్‌ఎంసీ అధికారులు శానిటేషన్ చేయటం చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు.
- చెత్త రిక్షా కార్మికులు కూడా చెత్త సేకరణకు రావడం లేదు.
- డబుల్‌బెడ్‌రూం ఒక బ్లాక్ పూర్తిగా ఖాళీగా ఉండటంతో అసాంఘిక కార్యకలపాలు జోరుగా సాగుతున్నాయి.
- ఉదయం వేళల్లో తాళాలు పగులగొట్టి రాత్రి సమయంలో పేకాట, వ్యభిచారం, మద్యం, గంజాయి సేవించడం నిత్యం పరిపాటిగా మారింది.
- అడ్డుచెప్పిన వారిపై దాడులకు పాల్పడుతున్నారు.
- పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించకుండ అసాంఘిక వ్యక్తులకు మద్దతుగా ఉంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.
- సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు హామీలు ఇచ్చి విస్మరించారు.

పెరుగుతున్న నిర్వహణ భారం



సముదాయల్లో సుమారు 278 డబుల్ బెడ్ రూం ఇళ్లలో 200 మంది లబ్ధిదారులకు మాత్రమే ఇళ్లను కేటాయించి, మిగతావి ఖాళీగా ఉండటంతో నివాసితులపై నిర్వహణ భారం పెరుగుతుంది. రోజువారీ కూలి పనులు చేసుకుని నివసించే మాపై భారం అధికం అవుతోంది. సముదాయల ప్రాంగణంలోని వీధి దీపాలు, లిఫ్టులు, మంచినీటి సరఫరా, శానిటేషన్ నిర్వహణ మెయింటెనెన్స్ కమిటీ నిర్వహిస్తుంది.

– భీమరాజు గండికోట, మెయింటెనెన్స్ కమిటీ అధ్యక్షుడు

అసాంఘిక కార్యకలాపాలు



ఖాళీగా ఉన్న ఇళ్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. ఉదయం, రాత్రి అనే తేడా లేకుండా పేకాట, మద్యం, గంజాయి, వ్యభిచారం లాంటివాటిని యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. అడ్డువస్తున్న వారిపై మత్తులో దాడులకు పాల్పడుతున్నారు. ఇటీవలే 78 ఇళ్లలోని తాళాలు పగులగొట్టి లోపల అమర్చిన నల్లాలను ఎత్తుకెళ్లారు. సీసీ కెమెరాలను వెంటనే ఏర్పాటు చేయాలి. పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు.

– భీమనపల్లి సిద్దు, ప్రధాన కార్యదర్శి

నిత్యం చెత్తను సేకరించాలి



200పైగా కుటుంబాలవారు డబుల్‌బెడ్‌రూం సముదాయాల్లో ఉన్నారు. జీహెచ్‌ఎంసీ వసతులు కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఇళ్ల సముదాయల్లో నిత్యం చెత్తను సేకరించేలా చర్యలు చేపట్టాలి. ఇతర కాలనీలలో చేపట్టిన విధంగానే డబుల్ సముదాయాల్లో శానిటేషన్ పనులు చేపట్టాలి. నీటి సరఫరా బిల్లు లక్షల్లో చేరింది, భరించలేకపోతున్నాం. ప్రభుత్వమే ఆదుకోవాలి.

రూపానీ లింగస్వామి, మెయింటెనెన్స్ కమిటీ కోశాధికారి

ప్రభుత్వమే భరించాలి



ఖాళీగా ఉన్న డబుల్‌బెడ్‌రూం ఇళ్లను అర్హులైన పేదలకు వెంటనే అందజేయాలి. లిఫ్టులు, వీధి దీపాలు, కామన్ లైటింగ్ విద్యుత్‌ను, మంచినీటి సరఫరాను ప్రభుత్వమే భరించాలి. అసాంఘిక కార్యకలపాలు జరుగకుండా పోలీసులతో చర్చించి ప్రత్యేకంగా పెట్రోలింగ్‌ను చేయిస్తా. సీసీ కెమెరాల ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తా. శానిటేషన్, చెత్తను జీహెచ్‌ఎంసీ సేకరించేల చర్యలు చేపడుతా.

– చింతల అరుణ సురేందర్‌యాదవ్, నాగోలు కార్పొరేటర్

క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి


ఎమ్మెల్యేను కలిసిన చైతన్యపురి కాలనీవాసులు

చైతన్యపురి: చైతన్యపురి కాలనీలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కాలనీవాసులు శనివారం ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కాలనీలో నూతన రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, డ్రైనేజీ, లైబ్రరీ సమస్యలు పరిష్కారం అయ్యేలా చూడాలని ఎమ్మెల్యేను కోరారు. నూతన రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్లు ఎమెల్యే వారికి తెలిపారు. లైబ్రరీ, ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించేలా చూస్తానని అన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు కృష్ణమూర్తి, బీఆర్‌ఎస్ డివిజన్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన


సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి


ఎల్‌బీనగర్: అభివృద్ధి పనులలో నాణ్యత పాటిస్తూ వీలైనంత త్వరగా పూర్తి చేయాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ టీచర్స్ కాలనీ ఫేజ్–2లో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను శనివారం అధికారులు, కాలనీ సంక్షేమ సంఘం నాయకులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. డీఈ దామోదర్ రావు, ఏఈ రాకేష్, కాలనీ అధ్యక్షుడు శివకుమార్, నాయకుడు పవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

చైతన్యపురి: తమ ఇళ్లతో పాటు పరిసరాలనూ పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శ్రీసాయి గ్రామర్ హైస్కూల్ విద్యార్థులు, జీహెచ్‌ఎం, రాంకీ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం గౌతంనగర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పరిశుభ్రత లోపిస్తే అంటువ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ఇండ్లలోని చెత్తను రోడ్లపక్కన వేయవద్దని, జీహెచ్‌ఎంసీ ఆటో కార్మికులకు మాత్రమే ఇవ్వాలని సూచించారు. తడి పొడి చెత్తను వేర్వేరుగా వారికి అందజేయాలన్నారు. కార్యక్రమంలో గౌతంనగర్ కాలనీ సెక్రటరీ మధుసూదన్‌రెడ్డి, శ్రీ సాయి గ్రామర్ హైస్కూల్ కరస్పాండెంట్ శిరీష, విద్యార్థులు, ఆధ్యాపక బృందం, డివిజన్ నాయకులు భవానీ ప్రవీణ్ కుమార్, రమణారెడ్డి, దాసరి జయప్రకాష్, ఓంకార్, శానిటేషన్ సూపర్‌వైజర్ బుచ్చయ్య పాల్గొన్నారు.

క్రమశిక్షణ, నిబద్ధతతో కష్టపడాలి: సినీ హీరో కార్తికేయ


నృత్య ప్రదర్శనలో విద్యార్థులు

ఎల్‌బీనగర్: క్రమశిక్షణ, నిబద్ధతతో కష్ట పడి పనిచేసినప్పుడే ఏ వ్యక్తి అయిన తాను ఇష్ట పడిన రంగంలో విజయం సాధిస్తారని సినీ హీరో కార్తికేయ అన్నారు. నాగార్జున మోడల్ పాఠశాల 28 వార్షికోత్సవాన్ని శనివారం బీఎన్ రెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కార్తికేయ మాట్లాడుతూ... చిన్నారుల అభిరుచిని, వారిలో దాగి ఉన్న నైపుణ్యాలను గుర్తించి వారిని అయా రంగాలలో ప్రోత్సహించాలని సూచించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం గతేడాది పదవ తరగతి పరీక్షలో జీపీఏ 10 పాయింట్లు సాధించిన విద్యార్థులకు రూ. 5 వేలతోపాటు జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి, వైస్ చైర్మన్ రజనీ విఠల్‌రెడ్డి, డైరెక్టర్ లోహిత కార్తికేయ, సీఈఓ ఎ.శేషారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలపై నిర్లక్ష్యం తగదు: బీజేపీ


పాఠశాల ఆవరణను శుభ్రం చేస్తున్న బీజేపీ నాయకులు

హయత్‌నగర్: ప్రైవేటు పాఠశాలల ఫీజుల దోపిడీలను అరికట్టలేని ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి ఆరోపించారు. స్వచ్ఛ ఎల్‌బీనగర్‌లో భాగంగా శనివారం బీజేపీ నాయకులు హయత్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో చెత్త, టాయిలెట్లను శుభ్రం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... 12 వందల మంది చదువుతున్న ఈ పాఠశాలకు సరైన గదులు లేక విద్యార్థులు చెట్ల కింద చదువుతున్నారని, సరిపడా టీచర్లు లేక విద్యార్థులు నామమాత్రంగా వచ్చి పోతున్నారన్నారు. టాయిలెట్లు లేక విద్యార్థినులు ఇబ్బందులు వర్ణనాతీతం అన్నారు. పాఠశాలల అభివృద్ధికి కేంద్రం ఇచ్చిన నిధులను కూడా ఖర్చు చేయకుండా వెనక్కి పంపుతున్నారని, మన ఊరు మన బడి కింద ఎంపికైన పాఠశాలల్లో కూడా మౌలిక వసతులు లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. నియోజకవర్గాని తానే అభివృద్ధి చేస్తున్నాని చెప్పుకుంటున్న స్థానిక ఎమ్మెల్యే పాఠశాలల వైపు కన్నెత్తి చూడటం లేదని, ఎమ్మెల్యే ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. నాయకులు కళ్లెం రవీందర్‌రెడ్డి, ఉగాది ఎల్లప్ప, బండారి భాస్కర్, రఘుగౌడ్, యాదగిరి గౌడ్, ఎర్రవెల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు

నేడు లలితా యజ్ఞం

వనస్థలిపురం: వనస్థలిపురంలోని శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ ఆధ్వర్యంలో ఆదివారం సామూహిక లలితా సహస్ర పారాయణం, లలితా యజ్ఞంను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆలయంలో వారు విలేకరులకు వివరించారు. ఆదివారం ఉదయం 8 నుంచి 11.30 వరకు లలితా పారాయణం, లలితా యజ్ఞం, 11.30 గంటలకు మహా పూర్ణాహుతి, 11.45 గంటలకు సామవేదం షణ్ముఖ శర్మ ప్రవచనం, మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ బి.అశోక్‌కుమార్‌గౌడ్, వైస్ చైర్మన్‌లు మిట్టా రామ్మోహన్, కంచి కృష్ణమోహన్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ వి.ప్రభాకర్, కోశాధికారి టి.లక్ష్మారావు, సురేష్, వీరబ్రహ్మాచారి, బాలేశ్వర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం

ఉప్పల శ్రీనివాస్‌గుప్తా


మాట్లాడుతున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

నాగోలు: ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత స్పోర్ట్స్‌కి, క్రీడాకారులకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. నాగోలు డివిజన్ బండ్లగూడలో వి-స్పోర్ట్స్ అకాడమీలో ఫ్రెండ్స్ క్లబ్ ఆర్గనైజింగ్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఫ్రెండ్స్ కప్–2023 ఇంటర్ క్లబ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను శనివారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ... ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గ కేంద్రాల్లో స్పోర్ట్స్ స్టేడియంలు నిర్మిస్తున్నారన్నారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారు. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు కూడా కల్పిస్తున్నారన్నారు. క్రీడలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తామని తెలిపారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ×ఫ్రెండ్స్ కప్–2023 ఇంటర్ క్లబ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ లో తెలంగాణలోని పలు జిల్లాల బ్యాడ్మింటన్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఏసీపీ టాస్క్ ఫోర్స్ వరంగల్ జితేందర్‌రెడ్డి, శ్రీనివాసరావు, రమేష్, వెంకట్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

నాగోలు: ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎల్‌బీనగర్ పోలీసుల సమాచారం మేరకు... ఎల్‌బీనగర్, ఆర్టీసీ కాలనీలో నివాసం ఉండే పసుపుల శివకుమార్(19) తన తల్లి, అన్న ఆంజనేయులుతో కలసి ఉంటున్నాడు. శివకుమార్ ర్యాపిడ్ బైక్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొన్ని రోజులుగా ఏదో విషయంలో ఆంజనేయులు ఆందోళన చెందుతున్నాడు. మంగళవారం ఉదయం పని నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రెండు రోజుల క్రితం అన్న ఆంజనేయులుకు ఫోన్ చేసిన శివకుమార్ నేను తప్పు చేశాను... భయమవుతుందంటూ చెప్పాడు. ఎలంటి ఆందోళన చెందవద్దని సోదరుడు ఆంజనేయులు ధైర్యం చెప్పాడు. ఏ విషయమో తనకు చెబితే మాట్లాడుతానని తమ్ముడిని ఓదార్చాడు. ఏదో విషయంలో కుమిలిపోతున్న శివకుమార్ శుక్రవారం సాయంత్రం ఇంటికి వచ్చాడు. రాత్రి సోదరుడు ఆంజనేయలు ఇంటికి వచ్చి చూడగా గది డోర్ లోపలి నుంచి పెట్టి ఉంది. ఎన్ని సార్లు పిలిచినా సమాధానం రాలేదు. దీంతో డోర్ బలవంతంగా ఓపెన్ చేసి చూడగా శివకుమార్ సీలింగ్ హుక్కుకు చీరతో ఉరివేసుకుని కనిపించాడు. కిందకు దించి చూడగా అప్పటికే అతడు మృతి చెందాడు. ఆంజనేయలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

లింగోజిగూడ: వనస్థలిపురం లేబర్ అడ్డా సమీపంలోని శ్రీ సాయి నిత్య ఆస్పత్రిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకుడు వీరస్వామి గౌడ్ తెలిపారు. శిబిరాన్ని ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హిందూ అమ్మాయిల అదృశ్యంపై

ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలి


రాచకొండ సీపీ చౌహాన్‌ను సత్కరిస్తున్న శశిధర్

హస్తినాపురం: హిందూ అమ్మాయిల అదృశ్యం కేసులపై ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేయాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర సహ కార్యదర్శి డాక్టర్ రావినూతల శశిధర్ కోరారు. ఈ మేరకు రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ చౌహాన్‌ను కలిసి శనివారం శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శశిధర్ మాట్లాడుతూ... రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరుగుతున్న గోవుల అక్రమ రవాణాను అరికట్టలని, బలవంతపు మతమార్పిడి ముఠాలపై ఉక్కుపాదం మోపాలని కోరారు. కమిషనరేట్ పురిధిలో అక్రమంగా తిష్టవేసిన రోహింగ్యా ముస్లింలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులను లక్ష్యంగా చేసుకొని విద్యాసంస్థల కేంద్రంగా సాగుతున్న డ్రగ్స్ మాఫియాను అరికట్టాలని శశిధర్ కమిషనర్ చౌహాన్ కోరారు. స్పందించిన కమిషనర్ చట్టపరిధిలోని అన్ని సమస్యల పరిష్కారానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

అంతర్గత రోడ్ల అభివృద్ధిపై ఫోకస్

మలక్‌పేట: అంతర్గత రోడ్ల అభివృద్ధి... అవసరమైన ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. సలీంనగర్ ప్రమీలా అపార్ట్‌మెంట్‌లైన్‌లో రూ. 5 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులు శనివారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ... కాలనీల్లో అధ్వానంగా మారిన అంతర్గత రోడ్లు అందంగా తీర్చిదిద్దుతామన్నారు. జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్తిరెడ్డి, సూపర్ వైజర్ సతీష్, బీజేపీ నేతలు మోహన్, గణేష్, సంతోష్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

మన్సూరాబాద్ అభివృద్ధికి కృషి

కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: మన్సూరాబాద్ డివిజన్ సర్వతోముఖాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నానని కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. హిమపురికాలనీ ఫేజ్–2లో శనివారం ఆయన మార్నింగ్ వాక్ చేపట్టి కాలనీవాసుల నుంచి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... సహారాస్టేట్స్ కాలనీ వెనుక ఆటోనగర్ రోడ్డు నుంచి హిమపురికాలనీ ఫేజ్–2 మీదుగా డబుల్ బెడ్ రూం ఇళ్ల వరకు రూ. 6 కోట్ల వ్యయంతో బాక్స్‌టైప్ నాలా నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని, త్వరలోనే పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కాలనీవాసులు గోపికృష్ణారెడ్డి, జానయ్య, రామచంద్రుడు, బుచ్చిరెడ్డి, సంతోష్, రాజగోపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- విజయవాడ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా ముందస్తు ప్రణాళికలు చేపడుతున్నట్లు కార్పొరేటర్ నర్సింహారెడ్డి తెలిపారు. ఆగమయ్యనగర్, గణేష్‌నగర్ కాలనీ, మల్లికార్జుననగర్ కాలనీ, సాయినాథ్‌కాలనీలు జలమయం కాకుండా స్మార్ట్‌వాటర్ డ్రైన్ నిర్మాణానికి జాతీయ రహదారి అభివృద్ధి అధికారులు, జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. జాతీయ రహదారుల అభివృద్ధి ఏఈ శరత్‌చంద్ర, జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ ఏఈ స్వప్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ సీతారామ్, ఆయా కాలనీలవాసులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన


వైజ్ఞానిక అంశాలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: కొత్తపేట్ డివిజన్ బచ్‌పన్ అకాడమిక్ హైట్స్ పబ్లిక్ పాఠశాలలో శనివారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌ను కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పాఠశాల డైరెక్టర్ జితేంద్ర దేవి, రీజనల్ హెడ్ డైరెక్టర్ కె.శ్రీకాంత్‌రెడ్డితో కలిసి తరగతి గదులలో వెళ్లి విద్యార్థులు చేసిన ప్రాజెక్టులను పరిశీలించారు. పాఠశాల ఉపాధ్యాయులు, బీజేపీ నాయకులు సుందర్ నారాయణ, రామకృష్ణ, కొత్త తిరుమల్, వెంకట్ రెడ్డి, శరణ్ తదితరులు పాల్గొన్నారు.

'రసాయన దుర్గంధాన్ని' నివారించండి

జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



మన్సూరాబాద్: పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆదేశాల మేరకు ఆటోనగర్ డంపింగ్ యార్డ్ పక్క నుంచి డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయల వద్ద ఉన్న ట్రంక్ లైన్ వరకు డ్రైనేజీ నిర్మాణాన్ని త్వరలో చేపట్టాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేష్‌కుమార్‌ను శనివారం కలిసి సమస్య తీవ్రతను వివరిస్తూ పరిష్కరించాలని వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం ఎమ్మెల్యే దేవిరెడ్డి మాట్లాడుతూ... ఆటోనగర్‌లోని ఇండస్ట్రియల్ ప్రాంతం నుంచి వస్తున్న రసాయన వ్యర్థాలు డంపింగ్ యార్డ్ వద్ద నిలిచిపోతున్నాయన్నారు. దీంతో పరిసర కాలనీలవాసులు ఆ రసాయన వ్యర్థాల నుంచి వెలువడుతున్న దుర్గంధాన్ని భరించలేకపోతున్నారన్నారు. చర్మ, శ్వాసకోశ వ్యాధుల బారినా పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన ట్రంక్‌లైన్ ఏర్పాటుకు అంచనాలు తయారు చేయాలని ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేస్తానని కమిషనర్ తెలిపారని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. డంపింగ్‌యార్డ్ నిర్మూలన సమితి సభ్యులతో కలిసి కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు సెక్రటరీ నీతుకుమారిప్రసాద్‌ను కలిసి జీహెచ్‌ఎంసీ, టీఎస్‌ఐఐసీ వారికి ఈ నెల 4వ తేదీన ఇచ్చిన ఆదేశాలు అమలు, నిర్ణీత సమయంలోగా పనులు చేపట్టాలని కోరామన్నారు. అనంతరం టీఎస్‌ఐఐసీ మేనేజింగ్ డైరెక్టర్ వెంకటనర్సింహారెడ్డిని కలిసి ట్రంక్‌లైన్ పనులు త్వరగా చేపట్టాలని కోరినట్లు తెలిపారు. డంపింగ్‌యార్డ్ నిర్మూలన సమితి అధ్యక్షుడు టంగుటూరి నాగరాజు, వివిధ కాలనీల ప్రతినిధులు కరణం శ్రీకాంత్, గోపికృష్ణారెడ్డి, చంద్రారెడ్డి, వెంకట్‌రెడ్డి, మారం రాజేశ్, బాల్‌రెడ్డి, భాస్కర్, వాసుయాదవ్, రవి, విజయలక్ష్మి, శ్రీధర్ పాల్గొన్నారు.